క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రావణ్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో అబ్బి భీమమ్మ సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు మంగళవారం రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుందరయ్య, టైలర్ యాదయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



వలిగే కృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘణపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వలిగే కృష్ణను మంగళవారం పెద్దఎల్కిచర్ల పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనలో ఆయన విశేషమైన కృషి చేశారని గుర్తు చేశారు. సమాజ పరిస్థితులను అవగాహన చేసుకొని, సామాజిక అణచివేతలు తొలగిపోయి సమసమాజ స్థాపనలో తన భావాలను కవితా రూపంలో వ్యక్తపరచడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆయన 'రేపటి వేకువ మాదే' అనే పుస్తకాన్ని రచించి అందరి మన్ననలను అందుకున్నాడని సత్యం కొనియాడారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని పుస్తకాలు రచించి కీర్తిగడించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్, శ్రీదేవి, లలితాదేవి, కవిత, శేఖర్‌గౌడ్, తిరుమలయ్య, రాజ్‌కుమార్, రాగ్యా, శివాజీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి



అక్షరాభ్యాసం చేయిస్తున్న సంధ్యారాణి

షాద్‌నగర్ రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కాశిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యజ్యోతి కాటన్ మిల్లు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ హేమలత ఆధ్వర్యంలో దాత నందరాజ్‌గౌడ్ సహకారంతో గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసనం చేపట్టారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ గర్భిణులు ప్రతిరోజూ పాలు, పండ్లు, ఆకు కూరలు, గుడ్లువంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. తల్లి ఆర్యోగ్యంగా ఉంటేనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ సుదర్శనమ్మ, నర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్‌ల పంపిణీ

మొయినాబాద్ రూరల్: మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో వికలాంగులకు సిటీ, డిస్ట్రిక్ట్ బస్‌పాస్‌ల పంపిణీ చేయనున్నామని జిల్లా వికలాంగుల సమైక్య అధ్యక్షుడు నర్సింహ్మాచారి తెలిపారు. బుధవారం 10.30 గంటలకు క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్యాంప్‌కు హాజరయ్యేవారు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలను వెంట తెచ్చుకొని బస్‌పాస్‌లను తీసుకోవాలని పేర్కొన్నారు.

నిజాం దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: చేగూరు శివారులోని హజ్రత్ అలీ నిజాం దర్గాలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ముస్లింలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, ఎంపీటీసీ కుమార్ గౌడ్, తులసీరాం నాయక్, శ్రీశైలం, పసుల బుచ్చయ్య, రాములు పాల్గొన్నారు.

వ్యాధులతో జాగ్రత్త!

పశువులకు ముందస్తు టీకాలతో మేలు ● రేగడి దోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడుతున్నాయి. సాధారణంగా వచ్చే వ్యాధులతో పాటు ఆయా సీజనల్లో పశువులకు వ్యాధులు సోకుతున్నాయి. వీటికి వచ్చే వ్యాధులు, ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై రేగడి దోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి 'సాక్షి'తో వివరించారు.

వేసవిలో తట్టుకోలేవు

వేసవిలో ఎండ తీవ్రతను గేదెలు తట్టుకోలేవు. అందుకే వాటిపై తరచూ నీళ్లు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మేపాలి. దూడలు, చిన్నపాటి జీవాలకు వేసవిలో గ్లూకోజ్, ఓఆర్ఎస్ పౌడర్‌తో కలిపిన నీటిని తాపించాలి. దీనివల్ల అవీ వడదెబ్బకు గురికావు.

చిటుక వ్యాధి

ఈ వ్యాధి గొర్రెలు, మేకల్లో వర్షాకాలం ఆరంభంలో ఎక్కువగా వస్తుంటుంది. జీవాలు ఎక్కువగా తిరగడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. దీంతో అవీ వెంటనే మృతి చెందుతాయి. దీనిని నివారించేందుకు జీవాలకు ఈటీ వ్యాక్సిన్ ముందస్తుగా వేయించాలి.

జబ్బవాపు వ్యాధి

ఆవులు, ఎద్దుల్లో ఈ వ్యాధి సంభవిస్తుంది.





మేకల మంద (ఇన్‌సెట్‌లో) డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

పశువుల కాళ్ల వెనుకభాగంలో వాపు రావడాన్ని వ్యాధి లక్షణంగా పేర్కొనవచ్చు. అదేవిధంగా వీటి కాళ్ల ఒత్తినప్పుడూ గాని గాలి అన్నట్లు అనిపిస్తుంది. వాపు వచ్చిన భాగంలో విషపదర్థాలు చేరుతాయి. ఈ వ్యాధి పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. వ్యాధి నివారించేందుకు ముందస్తుగా బీక్యూ వ్యాక్సిన్‌ను వేయించాలి.

గొంతువాపు వ్యాధి

ఈ వ్యాధి గేదెల్లో వస్తుంది. గొంతు దగ్గర వాపు రావడాన్ని వ్యాధి లక్షణంగా చెప్పవచ్చు. ఈ వ్యాధి బారిన పడడం వల్ల గేదెలు గురక పెడుతాయి. శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతాయి. వర్షకాలంలో వ్యాధి సంభవిస్తుంది. ముందస్తుగా హెచ్‌హెచ్ వ్యాక్సిన్ వేయిస్తే మేలు. పశువుల కాపర్లు తప్పకుండా సరైన సమయంలో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరవని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

భయాన్ని వీడి.. విజయ తీరాలకు చేరండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్

మానసిక నిపుణుడు సుధాకర్

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులు భయాన్ని వీడి విజయం కోసం కష్టపడాలని మానసిక నిపుణుడు సుధాకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌గనర్ మండల పరిధిలోని కమ్మదనం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో ఇంటర్, పదోతరగతి విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానసిక నిపుణులు సుధాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటేనే సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఆత్మస్థైర్యంతో నడుచుకోవాలని సూచించారు.

తరగతి గదిలో గురువులు బోధించిన పాఠాలను శ్రద్ధగా గుర్తు పెట్టుకొని పరీక్షలో అడిగిన ప్రశ్నలకు జవాబులు రాయాలని అన్నారు. అనంతరం మానసిక నిపుణులు ఖాసీం మాట్లాడుతూ విద్యార్థులు బట్టి చదవులు కాకుడా విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యనభ్యసించాలని చెప్పారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని పాఠ్యాంశాలలోని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సలహాఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రణీత, ఉపాధాయినీలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్



సమ్మె నోటీసును అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లు, నాయకులు

మహేశ్వరం: ఫిబ్రవరి 16న చేపట్టనున్న గ్రామీణ బంద్‌లో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ హెల్పర్స్, టీచర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం యూనియన్ సభ్యులు అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజలపై కార్పొరేట్, మతతత్వ, నిరంకుశ దాడి పెరుగుతుందని మండిపడ్డారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేసే చర్యలను మానుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ.26 వేలు, ప్రభుత్వ అలవెన్సులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ కోశాధికారి కవిత, సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్, అంగన్‌వాటీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

కందుకూరు: ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌లో ఆశవర్కర్లు పాల్గొంటున్నట్లు మంగళవారం కందుకూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ రాధికకు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించుకునేందుకు బంద్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు జయసుధ, శ్రీలత, అనిత, చంద్రకళ, అప్రోచ్, ముంతాజ్‌బేగం, సునీత, అశ్విని, జయమ్మ, సురేష్ పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి

టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి

కేశంపేట: మండలం నుంచి అక్రమ పద్ధతిలో డిప్యుటేషన్లు పొందిన ఉపాధ్యాయుల ఆర్డర్లను రద్దు చేసి, సొంత పాఠశాలకు పంపించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో లేమామిడి పాఠశాల నుంచి శ్యామలదేవి, నాగులగడ్డ తండాలో శశికళ, జల్లరాళ్ల తండాలో ప్రశాంతి, కొత్తపేటలో సరిత, నాను తండాలో బాలనర్సమ్మ, లింగంధనలో రాజవర్ధన్‌రెడ్డి, పోమా ల్‌పల్లిలో లక్ష్మణ్, ఎక్లాస్‌ఖాన్‌పేటలో స్వరూప, పాపిరెడ్డిగూడ జెడ్పీ పాఠశాలలో కవిత, శ్రీలక్ష్మీ, నిర్దవెల్లిలో బొందయ్య, తొమ్మిదిరేకులలో కవితలు డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లినట్టు వారు తెలిపారు. ఉపాధ్యాయులు అక్రమంగా డిప్యుటేషన్‌పై వెళ్లడంతో మండలంలో కొన్ని పాఠశాలలు మూతపడినట్టు వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం బాధాకరమని వారు పేర్కొన్నారు.

భువనగిరి టికెట్ ఇవ్వండి

ఈసీ శేఖర్‌గౌడ్



డిప్యూటీ సీఎం భట్టిని కలిసి అభ్యర్థన పత్రం ఇస్తున్న శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ సీటు తనకు కేటాయించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్ కోరారు. గాంధీ భవన్‌లో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి బయోడేటాను అందజేశారు. పార్టీ కోసం 40 సంవత్సరాలు కష్టపడి పని చేస్తున్నానని విన్నవించారు. తప్పకుండా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోతానని తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



షాద్‌నగర్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘు



శంకర్‌పల్లి: ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- గిరిజన సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు
- బాల్క సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి
- కాంగ్రెస్ నేతల డిమాండ్

చేవెళ్ల: బీఆర్ఎస్ నాయకులకు అధికారం పోయిందని మతి భ్రమించి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ హెచ్చరించారు. చేవెళ్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యవహార శైలిని తీవ్రంగా ఖండించారు.

షాద్‌నగర్: బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ గిరిజన సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యనన్నారు. దొరల మోచేయి కింద నీరు తాగే బాల్క సుమన్ అక్రమ ఆస్తులు ఎలా సంపాదించుకున్నాడనే చిట్టాను త్వరలో బయటపెడుతామని హెచ్చరించారు. పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, హరినాథ్ రెడ్డి, ముబారక్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: బాల్క సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఎస్సీసెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. బాల్క సుమన్ మతి భ్రమించి, స్థాయికి మించిన మాటలు మాట్లాడడం సరికాదన్నారు. ఎర్రోళ్ల జగన్, అంజినాయక్, జనిగ శివ, అనీల్, రాంజ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ నాయకులు నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ముఖ్యమంత్రి తేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలని శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎజాస్, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, తాఫిక్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్ వరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్



నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

చేవెళ్ల: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కోఆర్డినేటర్ వరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బేగరి రాజులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం దేవరంపల్లి గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ సంఘం రిజిస్ట్రేషన్ చేయించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధించు, సమీకరించు, పోరాడు నినాదంతో దేశంలో, రాష్ట్రంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఈ సంఘానికి మంచి గుర్తింపు ఉందని చెప్పారు. ఈ సంఘం చేస్తున్న ప్రజోపయోగ పనులను చూసి గ్రామాల్లో ఎంతోమంది సంఘంలో చేరుతున్నారని వారు పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చెన్నోళ్ల ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా హస్తాబాద్ బాలు, నర్సింలు, ప్రధాన కార్యదర్శులుగా యాదయ్య, బి ప్రవీణ్, సహాయ కార్యదర్శి రాజు, కోశాధికారిగా గడ్డమీది శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి రమేష్, మీడియా కార్యదర్శి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి రవికుమార్, సలహాదారులుగా శివయ్య, జంగయ్య, నరేందర్, కార్తిక్, జంగయ్య, తదితరులు ఉన్నారు.

సర్పంచుల సేవలు మరువలేనివి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



పాలకవర్గ సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

కొత్తూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం సర్పంచులు చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన మాజీ పంచాయతీ పాలకవర్గం అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు పదవీ కాలం పూర్తి చేసుకున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే ప్రతీ కార్యక్రమం విజయవంతం కావడానికి సర్పంచులు క్షేత్రస్థాయిలో ఎంతో బాధ్యతగా పనిచేశారని వివరించారు. అభివృద్ధి పనులు, సిబ్బంది వేతనాలకు ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాకున్నప్పటికీ కొందరు సర్పంచులు తమ సొంత నిధులను ఖర్చు చేసిన్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్‌ముదిరాజ్, ఉప సర్పంచ్ బాల్‌రాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో మంగళవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్యలు మాట్లాడారు. బీజేపీ దేశ వ్యాప్తంగా గావ్ చలో-ఘర్ చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. ఎన్నికల్లో భాగంగా ఈ నెల 20న నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ పార్లమెంట్ పరిధిలో క్లస్టర్ల యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, వంశీకృష్ణ, శ్రీనివాస్, శ్రీకాంత్, దొడల వెంకటేష్, కుర్మయ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం



మైకుసెట్ అందజేస్తున్న మునగపాటి స్వరూప నర్సింహులు

- సర్దార్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌నాయక్
- మాజీ సర్పంచ్ మునగపాటి స్వరూప నర్సింహులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని సర్దార్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ మునగపాటి స్వరూప నర్సింహులు మైకు సెట్‌తో పాటు మైక్రోఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు దాతల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలన్నారు. మాజీ సర్పంచ్ మునగపాటి స్వరూప నర్సింహులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం తమవంతు సాయం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణకుమార్, రవీందర్, జంగయ్య, శివకుమార్, కృష్ణయ్య, సుశీల, గిరిజ, సునీత, భారతి, విజయశ్రీ, శశికళ, అంజిలమ్మ, కవిత, రోహిణి, మొహిన్, డాక్టర్ శంకర్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచన లత



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కాంచన లత, విద్యార్థులు

చేవెళ్ల: ప్రతీరోజు మనం తీసుకునే ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరిగా వహించాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచన లత పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో కల్తీ ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఆహారపదార్థాల్లో కల్తీ రోజురోజుకు ఎక్కువవుతుందన్నారు. ఈ విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలన్నారు. మార్కెట్‌లో కొనుగోలు చేసుకునే ఆహార పదార్థాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన ఆహార పదార్థాలనే వాడటం మంచిదని సలహా ఇచ్చారు. 'ఆహారపదార్థాల కల్తీ' వర్క్‌షాప్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ అధ్యాపకులు జ్యోతి, సతీష్, లక్ష్మి, శకుంతల, వైష్ణవి, రవీంద్ర, షేక్ మహబూబ్, స్వర్ణలత, రాగిణి, వెంకటేశ్వర్లు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.